సాక్షి నిజామాబాద్

సోమవారం ; 4 ; సెప్టెంబర్ ; 2023



గండికి మరమ్మతులెప్పుడో!

ఎస్సారెస్పీ లక్ష్మి కాలువకు నల్లూర్ శివారులో గండి పడింది. మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- 8లో ▸



పల్లెల్లో నిఘా నేత్రాలు

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం కావడంతో గ్రామాల్లో స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకుంటున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.7 /24.5

ఉదయం చల్లగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రూ.5 కోట్లకు టోకరా

ఖలీల్‌వాడి : నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన ఓ మెడికల్ షాపు యాజమాని రూ.ఐదు కోట్లకు టోకరా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. పది రోజుల నుంచి ఇంటికి, దుకాణానికి తాళం ఉండటంతో అప్పులు ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు. అపార్ట్‌మెంట్‌లోని పలువురి వద్ద రూ.50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు, మరి కొంత మంది వద్ద రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు అప్పు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫోన్ పనిచేయకపోవడం, ఆయన నగరంలో లేకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎస్సై సంజీవ్‌ను వివరణ కోరగా బాకీల వారు వేధిస్తున్నట్లు షాపు యాజమాని ఫిర్యాదు చేశారని, అలాగే అప్పు ఇచ్చిన వారు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన వరద

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరిగింది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి 21,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో628 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం రాత్రికి 1090.70 (88.66 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నేటి నుంచి 10 వరకు పలు రైళ్లు రద్దు

సుభాష్‌నగర్ : నిజామాబాద్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు ఈ నెల 4 నుంచి 10వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లలో నిర్వహణ (మెయింటెన్స్) పనులు కొనసాగడంతో రైళ్లు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్–కరీంనగర్ రైలు, కరీంనగర్–నిజామాబాద్ రైలును రద్దు చేశారు. డోన్ నుంచి నిజామాబాద్‌కు వెళ్లే రైలు ఆదివారం నుంచి 9వ తేది వరకు, నిజామాబాద్ మీదుగా పండరీపురం వెళ్తున్న రైలు సోమవారం నుంచి 10వ తేది వరకూ రద్దయినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపిక



యాదగిరి



లింగన్న

మోపాల్ : తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్, కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఎం యాదగిరిని రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఆదివారం ప్రభుత్వం ఎంపిక చేసింది. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో యాదగిరి అవార్డును అందుకోనున్నారు.

గిరిరాజ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్


నిజామాబాద్‌అర్బన్ : గిరిరాజ్ కళాశాల వాణిజ్య శాస్త్రా అసిస్టెంట్ ప్రొఫెసర్ లింగన్న రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. రెంజల్ మండలం బోర్గంకు చెందిన లింగన్న 2011లో లెక్చరర్ ఉద్యోగం పొందాడు. అవార్డు రావడంతో ఆయనను పలువురు అభినందించారు.

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎర్ర రాంభాస్కర్ రాజు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన అవార్డు అందుకోనున్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికైనందుకు ఆనందంగా ఉందని రాంభాస్కర్ రాజు పేర్కొన్నారు.

టీచర్ల బదిలీలపై ఇంకా రాని ఉత్తర్వులు

- ఆన్‌లైన్‌లో కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ


నిజామాబాద్‌అర్బన్ : టీచర్ల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కానీ అధికారిక ఉత్తర్వులు మాత్రం ఇంకా అందలేదు. ఆదివారం నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లా విద్యాశాఖకు మాత్రం బదిలీలు, పదోన్నతుల ఉత్తర్వులు అందలేదు. నేడు ఉత్తర్వులు అందే అవకాశం ఉంది.



గద్మోల్ వద్ద పారుతున్న కప్పలవాగు

వర్షం.. రైతన్నలో హర్షం

- జిల్లావ్యాప్తంగా కురిసిన వాన
- అత్యధికంగా చీమన్‌పల్లిలో 54 మిల్లీమీటర్ల వర్షపాతం
- పంటలకు ఊపిరి పోసిన వరుణుడు



నిజామాబాద్‌లో వర్షంలో నడుచుకుంటూ వెళ్తున్న యువతి

నిజామాబాద్‌లోని ఎల్ఐసీ చౌరస్తాలో నిలిచిన నీరు

వర్షపాతం వివరాలు

మండలం	మి.మీ.
సిరికొండ	54.0
మెండోరా	53.2
ఆలూర్	24.4
వేల్పూర్	22.7
ముప్కాల్	22.1
భీమ్‌గల్	18.8
ధర్పల్లి	14.1
డిచ్‌పల్లి	14.0

సుభాష్‌నగర్ : నెల రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు ఆదివారం జిల్లాను పలకరించాడు. ఎండుతున్న పంటలకు జీవం పోశాడు. నెల రోజుల విరామం తర్వాత చిరు జల్లులు జిల్లాను పలకరించాయి. వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు వర్షం కోసం ఎదురుచూశారు. మరోవైపు ఆరుతడి, బోరు మోటార్ల కింద సాగు చేసిన వరి రైతులు వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు చూశారు. నెల రోజులుగా వర్షం లేకపోవడంతో ఆరు తడి పంటలు వాడిపోయే స్థితికి వచ్చాయి. ఈ సమయంలో వర్షం పడటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొట్ట దశలో ఉన్న సోయాబీన్, మొక్కజొన్న పంటలకు వాన ఎంతో మేలు చేకూర్చింది. శనివారం సాయంత్రం తర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా చీమన్‌పల్లిలో 54 మిల్లీమీటర్లు, మెండోరాలో 53.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 7.8 మిల్లీమీటర్ల సగటు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడక్కడ భారీ వర్షం కురవగా, ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంది.

ఆగస్టులో లోటు వర్షపాతం

జిల్లాలో ఆగస్టు నెలలో పలు మండలాల్లో చిరుజల్లులు మాత్రమే కురిశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆ నెలలో లోటు వర్షపాతం నమోదైంది. మొదట్లో సెప్టెంబర్ రెండోవారంలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. కానీ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా మరో మూడ్రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు.

నకిలీ ఓటర్ల నమోదు కలకలం

- నగరంలోని 261వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఘటన
- నిందితులను పట్టుకున్న కాంగ్రెస్ నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు తాహెర్ బిన్ హందాన్

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ నగరంలో నకిలీ ఓటర్ల నమోదు కలకలం రేపింది. నగరంలోని 261 పోలింగ్ కేంద్రంలో బూత్‌స్థాయి అధికారులతో పాటు నిబంధనలకు విరుద్ధంగా వేరే వ్యక్తులు గంటల తరబడిగా ఉన్నారు. వారు బోగస్ ఓటర్ల నమోదు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న కాంగ్రెస్ నాయకులు కేంద్రానికి వెళ్లి పోలింగ్ బూత్ స్థాయి అధికారులను నిలదీశారు. అక్కడికి నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ బాల్‌రాజు రాగానే కాంగ్రెస్ నాయకులు నిలదీశారు. దొంగ ఓటర్ల నమోదుకు అధికారులే సహకరిస్తున్నారని మండిపడ్డారు.

ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలకు ఆదివారం చివరి రోజు. అయితే నగరంలోని 261 పోలింగ్ కేంద్రంలో బూత్‌స్థాయి అధికారులతో పాటు వేరే వ్యక్తులు గుంపులు ఉండటాన్ని కాంగ్రెస్ మైనారిటీ నాయకులు గమనించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాహెర్ బిన్ హందాన్‌తో పాటు ఇతర నాయకులకు సమాచారం ఇచ్చారు. వారు కేంద్రానికి చేరుకొని అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను ప్రశ్నించారు. వారి వద్ద ఆర్మూర్‌కు సంబంధించిన ఓటరు జాబితా ఉండటంతో అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం నిజామాబాద్ సౌత్ తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అనంతరం పోలింగ్ కేంద్రం, సౌత్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, కార్పొరేటర్ గడుగు రోహిత్, వికలాంగుల సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి, సయ్యద్ ఖైసర్, ఎజాస్, నజీబ్‌అలీ, ఇసాబై, ఉబేద్ పాల్గొన్నారు.

విచారణ చేస్తున్నాం

ఏ పోలింగ్ కేంద్రంలో అయినా బూత్ స్థాయి అధికారులు తప్పా వేరే వాళ్లు ఉండకూడదు. అయితే శ్రీనివాస్, కృష్ణ, షబానా అనే ముగ్గురు కేంద్రంలో ఉన్నారు. వీళ్ల దగ్గర ఆర్మూర్‌కు సంబంధించిన 2021 ఓటరు జాబితా ఉంది. ఇదేంటని ప్రశ్నిస్తే తాము లిటిక్ అనే సంస్థ ద్వారా సర్వే చేస్తున్నామని చెప్పారు. దీనిపై విచారణ చేస్తున్నాం. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– బాల్‌రాజ్, సౌత్ తహసీల్దార్

అధికార నాయకులే చేస్తున్నారు..

అధికార పార్టీ నాయకులే దొంగ ఓటర్ల జాబితాను తయారు చేయిస్తున్నారు. ఆరు నెలలుగా ఇదే పనిలో ఉన్నారు. ఈ రోజు దొరకడంతో అధికారులు సైతం పొంతన లేని సమాధానం చెబుతున్నారు. పోలింగ్ కేంద్రంలో పదుల సంఖ్యలో అనుమానిత వ్యక్తులు ఉన్నారు. అధికారులు రాగానే వాళ్లు ఎక్కడికి పోయారో చెప్పడం లేదు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా తయారీలో మార్పిడి జరుగుతోంది. దొంగ ఓటరు జాబితా తయారు చేస్తూ, ఫొటోలు తీస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఓటరు నమోదు పక్కాగా చేపట్టాలి

ఆర్మూర్‌టౌన్ : ఓటరు నమోదు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. ఆర్మూర్‌లోని ప్రాథమిక ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ నమోదు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ విజయకాంతరావు, ఆర్ఐ అశోక్ సింగ్, ఎన్నిల డీటీ మాజీద్ పాల్గొన్నారు.



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

దరఖాస్తులు @8,494

ముగిసిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు

సుభాష్‌నగర్ : ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం చేపట్టిన రెండ్రోజుల ప్రత్యేక శిబిరాలకు జిల్లాలో 8,494 దరఖాస్తులు వచ్చాయి. శని, ఆదివారాల్లో ఎన్నికల సంఘం సూచనల మేరకు పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోల ద్వారా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా రెండ్రోజుల పాటు మొత్తం 1,549 పోలింగ్ కేంద్రాల్లో 8,494 దరఖాస్తులు వచ్చాయి. అందులో కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం -6 దరఖాస్తులు 6,395, తొలగింపు కోసం ఫారం–7కు 343, మార్పులు, చేర్పుల కోసం ఫారం–8కు 1,756 దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు శిబిరాలను పరిశీలించారు. ఇప్పటికే ముసాయిదా జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటరుగా నమోదు చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటరు నమోదుపై ఎన్నికల సంఘం పలుమార్లు అవకాశం కల్పించింది. సెప్టెంబర్ 19వ తేదీవరకూ పేర్లు నమోదు చేసుకోవచ్చు. అక్టోబర్ 1న జాబితాను పరిశీలించి, 4న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.



మోస్రాలో ఓటరు నమోదు వివరాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

ఎస్సారెస్పీ నీటికి పరీక్షలు చేయించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటికి కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులతో సమగ్ర పరీక్షలు జరిపించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ నీరు రంగు మారడంతో ఆదివారం ఆయన పరిశీలించారు. ప్రాజెక్ట్‌లో ఎలాంటి వ్యర్థాలు కలువలేదని, నీరు కలుషితం కాలేదని ప్రాజెక్టు అధికారులకు ఆయన తెలిపారు. అయినా ఓ సారి సమగ్ర నీటి పరీక్షలు జరిపించాలని ఆయన సూచించారు. ప్రాజెక్ట్ నీటిలో ప్రస్తుతం ఉన్న ఆక్సిజన్ శాతం తదితర ప్రమాణాలను సంగారెడ్డిలోని ల్యాబ్‌లో పరీక్షించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సారెస్పీలో నీరు కలుషితమైనట్లు పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి సూచన మేరకు పరిశీలించామన్నారు. నీరు కలుషితం కాలేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శనివారం ప్రాజెక్ట్‌లో పలు చోట్ల నీటి నమూనాలను సేకరించారన్నారు. ప్రాజెక్ట్ ఎగువన ఉన్న బాసర, యంచ వద్ద కూడా నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారన్నారు. నీటిలో ఎలాంటి కలుషితాలు లేవని చెప్పారన్నారు. ఆయకట్టు రైతులు, ప్రజలు ఆందోళనకు గురి కావొద్దన్నారు. ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి, ఆర్డీవో వినోద్‌కుమార్, పీసీబీ ఏఈ మానస, మిషన్ భగీరథ డీఈ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు బాల్కొండ మండలం శ్రీరాంపూర్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ శ్రీధర్ ఉన్నారు.



ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

గుట్టుగా 'గృహలక్ష్మి' జాబితా!

- ఎమ్మెల్యేల ఆదేశాలతో సిద్ధం చేస్తున్న స్థానిక నాయకులు
- అధికార పక్షాన్ని వ్యతిరేకించేవారు ఉంటే వారి పేర్లతో ప్రత్యేక లిస్ట్
- గ్రామాల్లో వేగంగా పావులు కదుపుతున్న నాయకులు



మోర్తాడ్ : గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగానే ఉంటుందని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. పథకం కింద లబ్ధి పొందేవారి పేర్లను అధికార పార్టీకి చెందిన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపిక చేసి గుట్టుగా జాబితాలను సిద్ధం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పథకం కింద సొంత స్థలంలో ఇల్లు కట్టుకునే వారికి రూ.మూడు లక్షల సాయం చేయనున్నారు. నియోజకవర్గానికి మూడు వేల మందికి ఇండ్ల నిర్మాణం కోసం సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.7,350 కోట్లు కేటాయించారు. రాబోయేది ఎన్నికల సీజన్ కావడంతో లబ్ధి పొందేవారు అధికార పార్టీకి అండగా నిలిచేలా చూడాలని అధినాయకులు పార్టీ యంత్రాంగానికి సూచనలు చేసినట్లు తెలిసింది. దీంతో గృహలక్ష్మి కింద తమకు అనుకూలంగా ఉండే వ్యక్తులనే ఎంపిక చేసి ఇంటి నిర్మాణం కోసం సాయం అందించడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.

జిల్లాలో 25 వేల దరఖాస్తులు

గ్రామం భౌగోళిక పరిస్థితులు, ఓటర్ల సంఖ్య ఆధారంగా ఒక్కో గ్రామానికి ఒక విధంగా లబ్ధిదారుల సంఖ్యను నిర్ణయించారు. ఒక్కో నాయకుడి ద్వారా 10 మంది నుంచి 20 మందికి లబ్ధి చేకూర్చాలని అంతే మొత్తంలో జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశాలు అందాయి. లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసి ఎమ్మెల్యేల కార్యాలయాలకు పంపిస్తే వారికే గృహలక్ష్మి కటాక్షం లభించే అవకాశం ఉంది. ఇప్పటికే లబ్ధి చేకూర్చాల్సిన వ్యక్తుల వివరాలతో కూడిన జాబితాలను అధికార పక్షం నాయకులు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలకు పంపించినట్లు తెలిసింది. గృహలక్ష్మి పథకం కింద జిల్లాలో దాదాపు 25వేల దరఖాస్తులు అధికారులకు అందాయి. వీటిపై మండల స్థాయి అధికారులు పరిశీలన సైతం జరిపారు. వాటిని పరిగణలోకి తీసుకోకుండానే అధికార పార్టీ నాయకులు అందించిన జాబితాల ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక జరుగనుందని ప్రచారం జరుగుతోంది. ఏ సంక్షేమ పథకం కింద అయినా లబ్ధి పొందేవారి పేర్లు గ్రామసభల్లో ప్రతిపాదించి ఎంపిక చేయాల్సి ఉంటుంది. గృహలక్ష్మికి సంబంధించి ఎలాంటి గ్రామ సభలను నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదు. గుట్టుగా లబ్ధిదారులను ఎంపిక చేసి తమకు అనుకూలమైన వారికే రూ.మూడు లక్షల సాయం అందించనున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాజకీయ కోణంలో ఎంపిక చేయొద్దు



గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులైన పేదవారికి సొంత ఇల్లు నిర్మించుకోవడానికి సాయం అందించాలి. రాజకీయ కోణంలో లబ్ధిదారులను ఎంపిక చేయడంతో అర్హులైన వారు లబ్ధి పొందకపోవచ్చు. గ్రామసభల్లో చర్చించి ఇంటి నిర్మాణంకు రూ.మూడు లక్షలు అందించాలి.

– దేవారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, ఏర్గట్ల

అనర్హులకు అందిస్తే ఉద్యమం



గృహలక్ష్మి పథకం కింద అనర్హులకు సాయం అందిస్తే ఉద్యమం తప్పదు. అర్హులైన వారికే సాయం అందించాలి. పార్టీల పరంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారు. ఇల్లు నిర్మించుకునేవారు పేదలా కాదా చూడాలి. అసలైన పేదలనే ఎంపిక చేయాలి.

– పుప్పాల నరేష్, బీజేపీ మండలాధ్యక్షుడు, మోర్తాడ్

సీపీ సారూ జర సూడుండ్రి!

- అప్పారావుపేట్‌లో పేకాట కేంద్రం నిర్వహణలో జిల్లావాసులు
- నిత్యం కార్లలో వెళ్తున్న పలువురు
- తనిఖీలు చేపట్టని పోలీసులు
- కొత్త సీపీ చర్యలు చేపట్టాలని ప్రజల వేడుకోలు



ఖలీల్‌వాడి : నిర్మల్ జిల్లా స్వర్ణ మండలం సరిహద్దులోని చెక్‌పోస్టుకు సమీపంలో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా అప్పారావుపేటలో పేకాట కేంద్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఈ కేంద్రానికి జిల్లా నుంచి నిత్యం చాలా మంది పేకాట ఆడటానికి వెళ్తుంటారు. పోలీస్ కమిషనర్‌గా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో పేకాట కేంద్రానికి వెళ్లే వారిని కట్టడి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. అప్పారావుపేట్‌కు వెళ్లే కార్లపై నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టితే పేకాటను నియంత్రించే అవకాశాలు ఉన్నాయి. ప్రతి రోజు పేకాట ఆడేందుకు సుమారు 40 కార్లలో వెళ్తున్న పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. జిల్లాలో పేకాట ఆర్గనైజర్‌లను ఏర్పాటు చేసుకొని కార్లలో తరలిస్తున్నారు. సీపీ సత్యనారాయణ నిర్మల్ పోలీసులతో సరిహద్దు ప్రాంతంలో నిఘా పెట్టి, తనిఖీలు చేపడితే అక్కడికి వెళ్లే వారు తగ్గుతారని జిల్లా ప్రజలు అంటున్నారు.

తనిఖీలు లేకపోవడంతో..

పేకాడే వారు నిర్మల్ జిల్లా స్వర్ణ మండలంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా అప్పారావుపేట్ వెళ్తున్నారు. చెక్‌పోస్టు వద్ద ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో వీరికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసేలా కొత్త సీపీ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డున పడుతున్న కుటుంబాలు

పేకాటతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అప్పారావుపేటలో రూ. 5 వేల నుంచి రూ. 30 వేల వరకు టేబుళ్లు ఉండటంతో కొందరు అప్పు చేసి పత్తాలు ఆడుతున్నారు. దీంతో ఇంట్లో గొడవలు జరిగి భార్యభర్తలు విడిపోయిన సందర్భాలు ఉన్నాయి. కొందరు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు జిల్లాలో గతంలో చోటు చేసుకున్నాయి.

జిల్లాకు చెందిన వారే పార్ట్‌నర్లు

జిల్లాకు చెందిన వారే అప్పారావుపేట్ పేకాట కేంద్రంలో పార్ట్‌నర్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరు గతంలో జిల్లా కేంద్రంలో పేకాట ఆర్గనైజర్‌గా పని చేసినట్లు సమాచారం. ఈ ఆర్గనైజర్ ద్వారా కొందరు ఉద్యోగులు, పోలీసుశాఖకు చెందిన వారు పెట్టుబడి పెట్టి అప్పారావుపేట్‌లో పేకాట కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

రాజీ మార్గంతో కేసుల నుంచి విముక్తి


ఎస్సై సాయికుమార్

భిక్కనూరు: కోర్టు కేసుల నుంచి రాజీ మార్గంతోనే విముక్తి పొందవచ్చని ఎస్సై సాయికుమార్ అన్నారు. పీఎస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని కోర్టులో ఈ నెల 9న లోక్ అదాలత్ ఉంటుందని పెండింగ్ కేసులు ఉన్నవారు సద్వినియోగం చేసుకొని కేసుల నుంచి విముక్తి పొందాలని సూచించారు.

8,9 తేదీల్లో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్, రాజాగౌడ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 8న అండర్–14, 16, 18, 20 బాలబాలికల విభాగంలో, ఈ నెల 9న అండర్–8, 10, 12, మెన్, ఉమెన్ విభాగంలో ఉదయం 10గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు. క్రీడాకారులు ఈ నెల 6 లోగా 9989040776 నంబర్‌కు ఫోన్‌చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్పలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షానికి ప్రధాన చౌరస్తాలో చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడింది. దీంతో తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉపసర్పంచ్ జగదీశ్ విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. వారు చెట్ల కొమ్మలు తొలగించి, విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘన సన్మానం



బాల్కొండ: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి పొలిశెట్టి లక్ష్మీనారాయణ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తన స్వగ్రామంలోని ఆలయంలో స్థానికులతో కలిసి పూజలు చేయడం ఆనందంగా ఉందని జడ్జి అన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ ముప్కాల్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, నాయకులు జడ్జిని సన్మానించారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి హైకోర్టు న్యాయమూర్తి కావడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మచ్చర్ల లక్ష్మి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గండికి మరమ్మతులెప్పుడో..!

- దెబ్బతిన్న లక్ష్మికాలువ
- పట్టించుకోని అధికారులు


నల్లూర్ శివారులో లక్ష్మికాలువపై ఏర్పడిన గండి

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి నీటిసరఫరా చేసే లక్ష్మి కాలువపై ముప్కాల్ మండలం నల్లూర్ శివారులో గండి పడింది. జూలైలో భారీ వర్షాలు కురవడంతో కాలువ ఓ వైపు నుంచి భారీ వరద వచ్చి కాలువ కట్ట కోతకు గురైంది. దీంతో కాలువ కట్టకు గండి ఏర్పడింది. కాలువపై పలు చోట్ల సైఫాన్లను నిర్మించారు. కాలువ ఎగువ భాగం నుంచి దిగువ భాగానికి నీటిని దాటించేందుకు నిర్మించినవే సైఫన్లు. కానీ అవి పూర్తిగా పూడికతో నిండిపోవడంతో నీరు పక్కకు వెళ్లి కాలువ కట్ట కోతకు గురవుతోంది. ముప్కాల్ శివారులో భారీ గండి ఏర్పడింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

150 క్యూసెక్కులే వదులుతున్న వైనం..

ప్రాజెక్ట్ నుంచి లక్ష్మికాలువ ద్వారా గరిష్ఠంగా 150 క్యూసెక్కుల నీటిని మాత్రమే వదులుతున్నారు. ఎక్కువగా నీరు వదిలితే గండి పడిన ప్రాంతంలో నీరు వృథా అవుతుంది. దీంతో అంత కంటే ఎక్కువ వదలలేని పరిస్థితి ఏర్పడింది. కాలువ సామర్థ్యం 500 క్యూసెక్కులు. కానీ ఈ మధ్యకాలంలో 300 క్యూసెక్కులకంటే ఎక్కువ వదిలిన దాఖాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి లక్ష్మి కాలువపై ఏరడిన గండ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మరో ఫీటు తగ్గించండి సారూ..!

- చెక్ డ్యాం గోడ తగ్గించాలని వెంచిర్యాల్ రైతుల వేడుకోలు


చెక్ డ్యాంపై కూల్చేసిన గోడ

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని వెంచిర్యాల్ శివారులో పెద్ద వాగుపై నిర్మించిన చెక్ డ్యాం ఎత్తు మరో ఫీటు తగ్గించాలని గ్రామ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. చెక్ డ్యాం గోడ ఎత్తుగా కట్టడంతో రెండు సంవత్సరాలుగా వర్షాలు కురిసినప్పుడల్లా వాగులో నిండిన నీరు పొలాల్లోకి చేరుతోంది. దీంతో ఏటా 320 ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. తాజాగా ప్రస్తుత సంవత్సరం కూడా గత నెలలో కురిసిన వర్షాలతో తీవ్ర నష్టం జరిగింది. ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటోంది. పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం అడ్డుకట్ట ఎత్తును తగ్గించేందుకు ప్రొక్లయిన్‌తో తవ్వకాలు చేపట్టింది. నిర్మించిన అడ్డుకట్టను సుమారు 3 ఫీట్లు తొలగిస్తే నీటి ప్రవాహానికి ఇబ్బంది ఉండదని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రెండు ఫీట్లు తొలిగించారు. అయినా నీరు ఎక్కువగా నిల్వ ఉంటోంది. మళ్లీ వర్షాలు కురిస్తే వరద పొంగి పంటలకు నష్టం వాటిల్లక ముందే పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

ఇంకా కోలుకోని పంటలు..

గత నెలలో కురిసిన వర్షాలతో పెద్దవాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో మక్క, పసుపు, సోయా, వరి పంటలు కొట్టుకుపోయాయి. పంటలు పూర్తిగా నీట మునగడంతో రైతులు ఇప్పటికీ కోలుకోలేక పోతున్నారు. ప్రభుత్వం ఇకనైనా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని చెక్‌డ్యాం గోడను మరో ఫీటుకు తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జోరు వానలోనూ ఆగని నిరసన

- ఏడో రోజుకు చేరిన సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్ష
- విద్యాశాఖలో విలీనం చేయాలని ఆందోళన


వానలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కామారెడ్డి రూరల్: తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్షఅభియాన్ ఉద్యోగులు చేపట్టిన దీక్ష ఆదివారం ఏడో రోజుకు చేరింది. భారీ వర్షం కురుస్తున్నా తమ లక్ష్యసాధనకు జిల్లాలో 500 మంది వర్షంలో తడుస్తూ దీక్షను కొనసాగించారు. 15 సంవత్సరాల నుంచి విద్యారంగంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. బంగారు తెలంగాణ వచ్చినా తమకు చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానా, బిహార్, ఒడిశా, మహారాష్ట్ర, ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో రెగ్యులర్ చేశారని తెలంగాణ రాష్ట్రంలో ఇంకా అమలు కావడం లేదన్నారు. తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేసేంత వరకు న్యాయ పోరాటం చేస్తామని జేఏసీ నాయకుడు సత్యనారాయణ పేర్కొన్నారు. దీక్షలో జిల్లా నాయకులు దామోదర్ వాసంతి, రాములు శైలజ, మాధవీ సంతోష్‌రెడ్డి, సంపత్, వీణ, కాళీదాస్, కళ్యాణ్, సంజీవులు నాయకులు తదితరులు ఉన్నారు.

సమాజంలో మంచి గుర్తింపు సాధించాలి


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్: సమాజంలో మంచి గుర్తింపుతోనే గౌరవ, మర్యాదలు లభిస్తాయని రిటైర్డ్ జిల్లా రీజినల్ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ బీఆర్ నర్సింగ్‌రావు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సంక్షేమ గురుకుల కళాశాలలో 2001–2003 ఇంటర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, అధ్యాపకులు కె.నాగేశ్వర శాస్త్రీ, డి.కిషన్, పి.నర్సింహా, కళాశాల పర్యవేక్షకుడు, కె.రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గేట్ వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై రాజు తెలిపారు. లింగంపేట మండలం లొంకలపల్లికి చెందిన కౌశిక్‌రెడ్డి, గోపాల్‌పేటకు చెందిన వెంకటసాయిగౌడ్ శనివారంరాత్రి ప్రయాణిస్తున్న కారు మాల్తుమ్మెద గేట్ వద్ద అడవిపందులు అడ్డురావడంతో అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్నది. ఈ ఘటనలో కౌశిక్‌రెడ్డికి రెండుకాళ్లు విరగ్గా, వెంకటసాయిగౌడ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. కౌశిక్‌రెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి ఒకరి గల్లంతు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ ఊర చెరువులో పడి ఒకరు గల్లంతైనట్లు ఎస్సై ఎల్ రాము ఆదివారం తెలిపారు. కులాస్‌పూర్‌కు చెందిన కటికె హుస్సేన్ (57) శనివారం సాయంత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆదివారం చెరువు కట్టపై హుస్సేన్ చెప్పులు, సెల్ ఫోన్ లభ్యమైనట్లు చెప్పారు.

మద్యానికి బానిసైన హుస్సేన్ జీవితం మీద విరక్తితో చెరువులో దూకి ఉంటాడని పోలీసులు తెలిపారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. హుస్సేన్‌భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ తండాకు చెందిన ధరావత్ శ్రీనివాస్(19) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన శ్రీనివాస్ తన తల్లిదండ్రులు మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో ఆగస్టు 30న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొర్పోల్ గ్రామంలో బ్యాగరి కాశీరామ్‌కు చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని పెద్దవాగు పరివాహక ప్రాంతంలో విద్యుత్ తీగ ఈదురుగాలులకు తెగి మేత మేస్తున్న ఎద్దుపై పడడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. ఎద్దు విలువ రూ. లక్ష వరకు ఉంటుందని, ట్రాన్స్‌కో అధికారులు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

మృతదేహం లభ్యం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ నల్లకుంట చెరువులో రెండోరోజుల క్రితం గల్లంతైన చెంచయ్య (32) మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎస్సై ఎల్ రాము తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు చెందిన చెంచయ్య పని నిమిత్తం కులాస్‌పూర్‌లోని ఇటుక బట్టీలో ఉన్న బంధువుల వద్దకు వచ్చాడు. శుక్రవారం సాయంత్రం స్థానిక నల్లకుంట చెరువులో కొంగలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. ఆది వారం మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటరమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కులాస్‌పూర్ చెరువులో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కులాస్‌పూర్ ఊర చెరువులో సుభద్ర (60) మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సుభద్ర బీడీలు, ఇతర పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తోంది. కొన్నాళ్లుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తోందని, నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మృతురాలి అక్క లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల మాలోత్ తండాకు చెందిన రమావత్ రూప్‌సింగ్(76) అనారోగ్యంతో ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. రూప్‌సింగ్ మూడు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు చెప్పారు.మృతుని భార్య దస్‌లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పల్లెల్లో నిఘా నేత్రాలు

- మోపాల్ మండలంలో 146 సీసీ కెమెరాలు ఏర్పాటు
- ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు


చిన్నాపూర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ వెంకట నారాయణ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం. ప్రస్తుత రోజుల్లో నేరాల నియంత్రణకు నిఘా నేత్రాలు ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను పోలీస్‌శాఖ వివరిస్తోంది. వ్యాపారులతో పాటు ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీలు వీటి ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఈక్రమంలో మోపాల్ మండలంలో 146 సీసీ కెమెరాలు ఇప్పటికే బిగించగా, అందులో కొన్నింటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

21 గ్రామ పంచాయతీలు..

మోపాల్ మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మోపాల్, కంజర్, కులాస్‌పూర్, మంచిప్ప, న్యాల్‌కల్, సిర్‌పూర్, నర్సింగ్‌పల్లి, చిన్నాపూర్, తదితర గ్రామాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు బిగించారు. త్వరలో మంచిప్పలో 25, ఎల్లమ్మకుంటలో 8తోపాటు సీసీ కెమెరాలు ఉన్న గ్రామాల్లోనూ సంఖ్య పెంచేందుకు పోలీస్‌శాఖ కసరత్తు చేస్తోంది. ఇటీవలే చిన్నాపూర్‌లో 6 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి ప్రారంభించారు.

నేర పరిశోధనలో కీలకపాత్ర..

ఏ చిన్న గ్రామంలోనైనా అనుమానాస్పదంగా నేరాలు జరిగినప్పుడు నిందితుల గుర్తింపులో నిఘా నేత్రాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఇటీవల ఓ హత్య కేసులో నిందితులను సీసీ పుటేజిల ద్వారా గుర్తించారు. చోరీలు జరిగినప్పుడు, అక్రమ మొరం, ఇసుక దందాలు, ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడుతున్నాయి. దొంగతనాల్లోనూ నిందితులను గుర్తించడంలో ముఖ్య భూమిక సీసీ కెమెరాలదే. ముఖ్యంగా సాక్ష్యంగా పని చేస్తున్నాయి. ఈక్రమంలో అన్ని గ్రామాల్లో కళాజాతా బృందాలు, ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల సంఖ్య పెంచి, నేరాలు అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు.

అన్ని గ్రామాల్లో ఏర్పాటే లక్ష్యం..



మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తు న్నారు. వీలైనంత త్వరగా నిఘా నేత్రాలను ఏర్పాటు చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. అందరి సహకారంతో మండలంలో నేరా లు అదుపులో ఉంచుతాం. –ఎల్ రాము, ఎస్‌ఐ, మోపాల్

మొక్కుబడిగా క్రీడా ప్రాంగణాలు

- తోరణాలకు పరిమితమైన వైనం
- పట్టించుకోని అధికారులు



తోరణానికి పరిమితమైన పిట్లం క్రీడా ప్రాంగణం

నిజాంసాగర్(జుక్కల్): తెలంగాణ గ్రామీణ క్రీడల నిర్వహణకు ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చు చేస్తున్నా, క్రీడా ప్రాంగణాలు యువతకు శాపంగా మారుతున్నాయి. గతంలో క్రీడా పోటీలకు అనువైన ఆట స్థలాలు లేక ప్రభుత్వ పాఠశాలలు, శ్మశాన వాటికలు, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు తోరణాలకే పరిమితమవుతున్నాయి. దీంతో క్రీడలు ఎలా ఆడేదంటూ యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు ఉండగా 161 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. అన్ని జీపీలతో పాటు అనుబంధ గ్రామాల్లో కలిపి 687 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది జూన్‌లో అన్ని గ్రామ పంచాయతీల్లో, అనుబంధ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంచాయతీ, ఈజీఎస్ శాఖల ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు క్రీడా ప్రాంగణాల ఏర్పాటు పనులు చేపట్టారు. కానీ జీపీల్లో ప్రభుత్వ స్థలాలు, అరకొరగా ఉన్న స్థలాలు క్రీడాప్రాంగణాలకు అనువుగా లేకపోవడంతో క్రీడల్ ప్రాంగణాలకు గ్రహణం పట్టుకుంది. ఇప్పటి వరకు జిల్లాలో 457 క్రీడా ప్రాంగణాలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్కొక్క క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు 2 ఎకరాల ప్రభుత్వ స్థలం అవసరం. అయితే సదరు క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, ఖోఖో, లాంగ్ జంప్, కబడ్డీ కోర్టులు, సింగిల్, డబుల్ బాల్ పోటీలు సదుపాయలు కల్పించాల్సి ఉంది. అంతేకాకుండా క్రీడా ప్రాంగణం చుట్టూ 400 మొక్కలు నాటడంతో పాటు ప్రాంగణం చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలి. ఒక్కొక్క క్రీడా ప్రాంగణానికి రూ. 2.5 లక్షల నుంచి రూ. 3.5 లక్షల చొప్పున కేటాయించారు. గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాన్ని చదును చేసి, తోరణాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా కొన్ని గ్రామ పంచా యతీల్లో కంచెను ఏర్పాటు చేసి, క్రీడలకు అవసరమైన స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు క్రీడల నిర్వహణకు అనువుగా లేకపోవడంతో యువకులు ఆటలకు దూరం అవుతున్నారు.

మండల కార్యాలయాల్లో కిట్లు


మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న కిట్లు

తెలంగాణ గ్రామీణ క్రీడలకు సంబంధించిన క్రీడా పరికరాలు, ఆట వస్తువులను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఆయా జీపీలకు సంబంధించిన క్రీడా పరికరాలు, సామగ్రి మండల పరిషత్ కార్యాలయాల్లో నిల్వ ఉన్నాయి. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, లాంగ్ జంప్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలకు సంబంధించిన కిట్లు సరఫరా అయ్యాయి. అయితే గ్రామ పంచాయతీల్లో మాత్రం క్రీడా ప్రాంగణాలు తోరణాలకే పరిమితం కావడంతో గ్రామీణ క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ. లక్షల విలువ చేసే క్రీడా సామగ్రితో పాటు క్రీడా ప్రాంగణాలు యువతకు ఉపయోగపడే విధంగా జిల్లా అధికారులు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్ని సౌకర్యాలు కల్పించాలి

గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లో క్రీడలకు సంబంధిచిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి. క్రీడా ప్రాంగణాలు తోరణాలకు పరిమితం కాకుండా క్రీడాకారులకు దోహదపడేలా ఉండాలి. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేలా అధికారులు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– ఇమ్రాన్, క్రీడాకారుడు, పిట్లం

క్రీడాకారులను ప్రోత్సహించాలి

గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి. జీపీల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడంతో పాటు సకల సదుపాయాలు కల్పించాలి. క్రీడలపై గ్రామ యువతకు మంచి ఆసక్తి ఉంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న క్రీడాపరికరాలు వృథా కాకుండా చూడాలి.
– ఉమర్, యువకుడు, పిట్లం

దేమికలాన్‌లో పెళ్లి ఆటో బోల్తా

- ఒకరి పరిస్థితి విషమం, పలువురికి గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని దేమికలాన్ శివారులో శనివారం రాత్రి పెళ్లి ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరి పరిస్థితి విషమం కాగా పలువురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కన్‌కల్ గ్రామానికి చెందిన అమ్మాయితో సంగోజివాడికి చెందిన ప్రశాంత్‌తో ఆదివారం వివాహం జరగాల్సి ఉంది. వధువు ఇంటి వద్ద శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమాల్లో వరుడి కుటుంబీకులు పాల్గొని వస్తుండగా ఆటో డ్రైవర్ పోశయ్య అజాగ్రత్త వల్ల ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉందని, పలువురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

పెద్ద దేవీసింగ్ తండాలో ఒకరి అదృశ్యం


భామన్ దేవీలాల్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పెద్ద దేవీసింగ్ తండాకు చెందిన భామన్ దేవీలాల్ అదృశ్యమైనట్లు ఏఎస్సై రాములు ఆదివారం తెలిపారు. తండాకు చెందిన భామన్ దేవీలాల్ కొన్నాళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఆగస్టు 31న ఆస్పత్రికి వెళ్తున్నట్లు చెప్పి తిరిగి రాలేదన్నారు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కౌన్సెలింగ్ కన్వీనర్ శ్రీరామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. బీ ఫార్మ, బయోమెడికల్, బయో టెక్నాలజీలో ప్రవేశం పొందేవారు రెండు రోజులు స్లాట్‌బుక్ చేసుకున్న విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం కళాశాలల ఎంపిక ఉంటుందన్నారు. ఈ నెల 11 నుంచి 14 వరకు సీట్లు పొందిన వారు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతిగృహంలో వంట చేయడానికి వంట మనిషి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిచ్‌పల్లి కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో జీ సవిత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసు కునే వారు పదోతరగతి పాసై ఉండాలని, సెప్టెంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు 6305148916, 9182322310 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.